

కృష్ణంరాజు స్మారక భవనానికి స్థలమిస్తాం

త్వరలో కుటుంబ సభ్యులను కలిసి వివరిస్తాం: అంబే

మొగల్తూరు: మాజీ కేంద్ర మంత్రి, రెబల్‌స్టార్ యు.వి.కృష్ణంరాజు స్మారక భవన నిర్మాణానికి తమ కళాశాల ఆవరణలో స్థలం కేటాయిస్తామని అంబే బాపన్న జూనియర్, కోట్ల వెంకటరంగారావు డిగ్రీ కళాశాలల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అంబే భుజంగరావు అన్నారు. శనివారం సాయంత్రం పేరుపాలెంలో తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణంరాజు కుటుంబ సభ్యులు ముందుకొస్తే భవన నిర్మాణం చేయాలని కోరేందుకు త్వరలోనే వారిని కలవనున్నామన్నారు. కృష్ణంరాజు మొగల్తూరుకు విశేష సేవలందించడంతోపాటు మంచి కీర్తిని సాధించారన్నారు. కృష్ణంరాజు స్మారక భవన నిర్మాణానికి యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవిని కలవనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఎంపిపి అంబే సూర్యావతి పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర మహాసభకు సర్వంసిద్ధం

భారీ సభా వేదిక, 30 వేల మంది కూర్చునేలా ఏర్పాట్లు

భీమవరంలో కార్మికుల పండుగ వాతావరణం

నేడు జిల్లాకు మూడు కార్మిక చైతన్య యాత్రలు



బహిరంగ సభా వేదికను సిద్ధం చేస్తున్న నేతలు, కార్మికులు

ప్రజాశక్తి - భీమవరం

సంస్కృతి, సంప్రదాయాలతోపాటు ఆతిథ్యంలో పెట్టింది పేరు గోదావరి జిల్లాలైతే.. ఉద్యమాల పురిటిగడ్డ.. రెండో బార్డోలిగా పేరొందిన భీమవరంలో మొట్టమొదటిసారిగా సిఐటియు ఆవిర్భవించాక తొలిసారి రాష్ట్ర మహాసభకు భీమవరం వేదికైంది. జనవరి 2, 3, 4 తేదీల్లో మూడు రోజులపాటు 16వ రాష్ట్ర మహాసభ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భీమవరంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్మిక నేతలంతా ఒకచోటకు చేరి ప్రభుత్వ విధానాలను ఎండగడుతుండడంతోపాటు హక్కులను కాపాడుకునేందుకు ప్రణాళిక రచించి కదం తొక్కనున్నారు. 2న భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహణతోపాటు 3, 4 తేదీల్లో ప్రతినిధుల సభ జరగనుంది. ఈ మహాసభ సంబంధించిన ఏర్పాట్లను ఆహ్వాన సంఘం ఇప్పటికే పూర్తి చేసింది.

బహిరంగ సభా స్థలం సిద్ధం

కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కేశవరావు హైస్కూల్లో రెండో తేదీన భారీ బహిరంగ సభ జరగనుంది. కార్మిక, ఉద్యోగుల భారీ ప్రదర్శనతో పాటు బహిరంగ సభకు పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలతోపాటు పరిసర జిల్లాల కార్మికులు



జెండాలు సిద్ధం చేస్తున్న కార్మికులు

పెద్దసంఖ్యలో తరలి రానున్నారు. జాతీయ, రాష్ట్ర నేతలు ఆశీనులయ్యేందుకు భారీ సభా వేదిక ఏర్పాటు చేశారు. సుమారు 30 వేలమంది సభా ప్రాంగణంలో కూర్చొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాంగణం అంతా చదును చేయడంతోపాటు చుట్టూ తోరణాలు, జెండాలతో అలంకరించారు. ఈ నేపథ్యంలో బస్టాండ్ చుట్టుపక్కల ప్రాంతమంతా అరుణారుణమై చూపరులను ఆకట్టుకుంటుంది. స్థానికంగా పండుగ వాతావరణం ఏర్పడింది.

నేడు జిల్లాలోకి ప్రవేశించనున్న బస్సు యాత్రలు

సిఐటియు రాష్ట్ర మహాసభ నేపథ్యంలో రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి బహిరంగ సభ ప్రాంగణానికి మూడు కార్మిక చైతన్య (బస్సు) యాత్రలు ఈ నెల 28న ప్రారంభమయ్యాయి. ఇచ్ఛాపురం, కుప్పం, శ్రీకాకుళం జిల్లా మందాడ నుంచి ప్రారంభమైన ఈ యాత్రలు ఆదివారం సాయంత్రం మన జిల్లాలోని తాడేపల్లిగూడెం చేరుకోనున్నాయి. ఈ యాత్రలకు ఘన స్వాగతం పలికేందుకు అక్కడ ఏర్పాట్లు చేశారు. అక్కడ నుంచి రెండో తేదీ ఉదయం ప్రారంభమయ్యే భారీ మోటార్ సైకిల్ ర్యాలీ అదేరోజు మధ్యాహ్నం భీమవరం పట్టణంలో నిర్వహించే భారీ ప్రదర్శనలో కలవనుంది.

చురుగ్గా ఏర్పాట్లు

మహాసభ నిర్వహణకు ఆహ్వాన సంఘం ఏర్పాటైన నాటి నుంచి ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్‌తోపాటు సిఐటియు, వివిధ కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల నేతలు చురుగ్గా ఏర్పాట్లు చేశారు. ఒకపక్క ఏర్పాట్ల పనుల్లో నిమగ్నమైనప్పటికీ మరోపక్క రెండు జిల్లాల్లో విస్తృతంగా ప్రచారం సాగించారు. అన్ని తరగతుల ప్రజలతోపాటు కార్మికులను సమాయత్తపర్చారు. ముఖ్యంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రపంచ ఆర్థిక మాంద్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు తదితర అంశాలపై భీమవరంలో రెండు సదస్సులు, తణుకు, తాడేపల్లిగూడెంలో ఒక్కోటి చొప్పున సదస్సులు నిర్వహించి అందరిలో చైతన్యాన్ని నింపారు.

తూతూమంత్రంగా జెడ్‌పి సమావేశం

పత్తా లేని మంత్రులు, ఎంఎల్‌ఎలు, కలెక్టర్

జెడ్‌పి చరిత్రలోనే అత్యంత పేలవంగా సర్వసభ్య సమావేశం

తాగునీరు, ధాన్యం, విద్యా సమస్యలపై జెడ్‌పిటిసిల ప్రశ్నలు

ఆఫ్ నాలెడ్జ్ సిఇఒతో ప్రభుత్వ ప్రతిష్టకు దెబ్బ: నరసాపురం జెడ్‌పిటిసి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రజా సమస్యలపై చర్చలకు, పరిష్కారాలకు వేదికగా నిలవాల్సిన ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా ముగించేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగిన జెడ్‌పి సర్వసభ్య సమావేశం జరిగిన తీరు చూసిన వారంతా ఇలాంటి దారుణమైన సమావేశం జిల్లా పరిషత్ చరిత్రలో ఎప్పుడూ జరగలేదని విమర్శలు వెల్లువెత్తాయి. జిల్లా పాలనకు వెన్నుముకగా జిల్లా పరిషత్‌ను పేర్కొంటారు. అటువంటి జెడ్‌పి సమావేశంలో ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని స్థానిక ప్రజాప్రతినిధులంతా వెయ్యికళ్లతో ఎదురుచూస్తారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లాలోని మంత్రులు, ఎంఎల్‌ఎలంతా ఈ సమావేశానికి హాజరై ప్రజాసమస్యలను చర్చించి పరిష్కారానికి కృషి చేస్తారు. అదే సమయంలో కలెక్టర్, జిల్లాలోని అన్నిశాఖల అధికారులు ఈ సమావేశానికి తప్పనిసరిగా రావాల్సి ఉంటుంది. అలాంటి సమావేశానికి జిల్లా కలెక్టర్‌గాని, ఇన్‌ఛార్జి మంత్రి, ఇతర మంత్రులతోపాటు, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 15 నియోజకవర్గాల్లోని ఏఒక్క ఎంఎల్‌ఎగాని హాజరు కాకపోవడం గమనార్హం. జిల్లా కలెక్టర్‌కు వేరే ముఖ్యమైన పని ఉంటే జెసి హాజరయ్యేవారు. ఈ సమావేశంలో అదీ లేకుండాపోయింది. వేదికపై జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, సిఇఒ కె.రవికుమార్ మాత్రమే ఉన్నారు. ఉదయమే స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించి మధ్యాహ్నం రెండుగంటల తర్వాత సర్వసభ్య సమావేశం సుమారు రెండు గంటలపాటు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్, విద్య, వ్యవసాయ, ఇరిగేషన్, డిఆర్‌డిఎ, సాంఘిక సంక్షేమ శాఖలపై మాత్రమే చర్చ నిర్వహించి తూతూమంత్రంగా సమావేశం కానిచ్చేశారు.

తేమశాతం తేడా ఎందుకంటూ ఆగ్రహం

ధాన్యం కొనుగోలులో రైతుభరోసా సిబ్బంది తేమశాతం 17 శాతంలోపుగా నిర్ధారించిన తర్వాత మిల్లర్లు 20 శాతంగా పేర్కొని సొమ్ము కట్టించుకోవడం ఏమిటని సభ్యులంతా ముక్తకంఠంతో ప్రశ్నించారు. దీనిపై వ్యవసాయాధికారులు, పౌర సరఫరాల శాఖాధికారులు ఇచ్చిన సమాధానాలకు సభ్యులు సంతృప్తి చెందలేదు. లారీలు ఉండటం లేదని, గోనె సంచుల ఇబ్బందులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సభ చివరిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.47 కోట్లు బడ్జెట్‌కు అమోదం తెలుపుతున్నట్లు ప్రకటించారు.

ఆఫ్ నాలెడ్జ్ సిఇఒతో ప్రభుత్వానికి చెడ్డపేరు

బొక్కా రాధాకృష్ణ, నరసాపురం జెడ్‌పిటిసి



జెడ్‌పి సిఇఒ రవికుమార్ నియంతలా వ్యవహరిస్తున్నారని, సగం పరిజ్ఞానం ఉన్న వ్యక్తి సిఇఒగా ఉండటం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని నరసాపురం జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో జెడ్‌పిటిసికి రూ.కోటి నిధులను జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ కేటాయిస్తే నరసాపురం మండలానికి రూ.40 లక్షలు మాత్రమే ఇచ్చారని, దీనిపై అనేకసార్లు తిరిగినా ఫలితం లేకుండాపోయిందని అన్నారు. మీకు నిధులివ్వాలంటే జిల్లా పరిషత్ భవనం అమ్మేయాలని సిఇఒ వెటకారంగా మాట్లాడారన్నారు. జెడ్‌పిటిసిలంటే సిఇఒకు ఏమాత్రం గౌరవం లేదన్నారు. అభివృద్ధి పనులు జరగకుండా సిఇఒ అడ్డుపడుతూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని మండిపడ్డారు. జెడ్‌పి ఛైర్మన్ చెప్పి పంపించినా నిధులపై లెక్కలేనితనంగా సిఇఒ వ్యవహరిస్తున్నారని, అధికారులను సైతం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. జెడ్‌పిటిసి మాట్లాడుతుండగా సిఇఒ మైక్ కట్‌చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్‌పి ఛైర్మన్ సర్ది చెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. జెడ్‌పి ఛైర్మన్ కష్టపడుతున్నా సిఇఒ తీరుతో అప్రతిష్ట ఏర్పడుతుందన్నారు. జెడ్‌పి ఛైర్మన్ కేవలం నిమిత్త మాత్రుడని, జెడ్‌పి సిఇఒనే అన్నీ తానై వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్న తరుణంలో జెడ్‌పి సమావేశంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆరోపణలకు నిలువుటద్దమైంది.


ఆశలు.. ఆకాంక్షలు

కొత్త సంవత్సరం 2023లోకి ప్రవేశించాం. మారేది క్యాలెండరే అయినా సామాన్యుల దగ్గర నుంచి పాలకులు, అధికారుల వరకూ అంతా కొన్ని ఆలోచనలతో అడుగులు వేయడం సహజం. కొత్త సంవత్సరంలో ఆ ఆలోచనలు ఏమిటీ.. ఆకాంక్షలు ఏమిటీ అనే దానిపై జిల్లాలోని కొందరు ప్రముఖులను ప్రజాశక్తి పలుకరించింది. వారి మనోగతం వారి మాటల్లోనే..



రీసర్వే పూర్తి చేయడమే లక్ష్యం

జెవి.మురళీ, జిల్లా జాయింట్ కలెక్టర్, భీమవరం



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని (రీసర్వే) ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. జిల్లాలో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో రీసర్వే జరుగుతోంది. కొత్త ఏడాదిలో రీసర్వేను జిల్లాలోని అన్ని గ్రామాల్లో చేపట్టి పూర్తి చేయాలనేది మా లక్ష్యం. రైతులు పండించిన ఉత్పత్తుల నిల్వ చేసుకునేందుకు మల్టీఫెసిలిటీ గొడౌన్లను అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. దిగమర్రు-పామర్రు 165 జాతీయ రహదారికి కోర్టు తీర్పుకు అనుగుణంగా భూసేకరణ చేపట్టి మార్చి నాటికి పూర్తి చేస్తాం. జిల్లాలోని అన్ని దళితవాడలతోపాటు ఇతర ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా శ్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో కొంత భూమిని గుర్తించాం. జిల్లాలోని ప్రధాన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతాం.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టే లక్ష్యం


జిల్లా ఎస్‌పి రవిప్రకాష్, భీమవరం



జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా, పకడ్బందీగా అరికట్టడమే లక్ష్యంగా పోలీసు శాఖ పని చేస్తోంది. గంజాయి, గుట్కా, దొంగతనాలు, హత్యలు, అల్లర్లు, కొట్లాటలు, కోడిపందేలు, పేకాట, వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. కొత్త ఏడాదిలో మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించేలా ప్రణాళికలు రూపొందించాం. ప్రజలందరికీ సత్వర న్యాయం అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. మహిళలు, చిన్నారులు, బలహీనవర్గాల భద్రతను పెంచే దిశగా అడుగులు వేస్తూ, రహదారి భద్రతా ప్రమాణాలు మరింత పెంచి, ప్రమాదాలు నివారించేందుకు మరింత కృషి చేస్తాం. ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణతోపాటు అసాంఘిక కార్యకలాపాలపై, అరాచక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం. డిజిపి ఆదేశాల మేరకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల ఆనవాళ్లు కనబడకుండా నిరంతర నిఘా ఏర్పాటుకు అన్ని చర్యలూ తీసుకుంటాం.

రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

దాసి రాజు, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ, భీమవరం



నూతన సంవత్సరంలో రెవెన్యూ పరమైన సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. ముఖ్యంగా జిల్లాలోని దళితవాడలతోపాటు మిగిలిన అన్ని ప్రాంతాల్లో అవసరం ఉన్న మేర శ్మశాన వాటికలు ఏర్పాటు చేయడం లక్ష్యంగా తీసుకున్నాం. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశాం. ముఖ్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీసర్వేను పటిష్టంగా అమలు చేయనున్నాం. భీమవరం డివిజన్‌లో ఆరు గ్రామాల్లో రీసర్వే పనులు సమర్థవంతంగా సాగుతున్నాయి. జనవరి ఒకటో తేదీ నుంచి మిగిలిన ఆరు మండలాల్లో రీసర్వే వేగవంతానికి చర్యలు తీసుకున్నాం. భీమవరం మార్కెట్ యార్డులో జిల్లా కలెక్టరేట్ ఏర్పాటుకు జనవరి నుంచి చర్యలు తీసుకుంటాం. దీని ఏర్పాట్లలో రెవెన్యూ శాఖ కీలకపాత్ర పోషించనుంది. నూతన సంవత్సరంలో జిల్లా ప్రజానీకమంతా ఆయురారోగ్యాలతో ఉండాలని మనసారా కోరుకుంటున్నాను.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

కవురు శ్రీనివాస్, జెడ్‌పి ఛైర్మన్



ఉమ్మడి జిల్లాలోని ప్రజలందరికీ, అధికారులకు, ప్రజాప్రతినిధులకు నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు. కొత్త సంవత్సరం 2023లో ప్రజలందరికీ మంచి జరగాలని, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను. కొత్త ఏడాదిలో ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతాం. జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఆంక్షాస్తున్నాం.

కార్మిక, కర్షక, సామాజిక ఐక్యత చాటాలి

వ్యకాస పూర్వ రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం

భీమవరం: కార్మిక, కర్షక, శ్రామిక, సామాజిక సంఘాలన్నీ ఐక్యంగా సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదంగా నిర్వహించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం పిలుపునిచ్చారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా శనివారం ప్రజాసంఘాల కార్యాలయంలో వివిధ ప్రజాసంఘాల నాయకులతో మహాసభ సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ భీమవరం పట్టణంలో మొట్టమొదటిసారిగా సిఐటియు రాష్ట్ర మహాసభ జరుగుతుందన్నారు. ఈ మహాసభ రాష్ట్రంలో భవిష్యత్తు కార్మిక, కర్షక ఉద్యమాలకు కార్యాచరణ ఇవ్వబోతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రజాసంఘాలు సమన్వయంతో వీటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతుసంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షులు బి.బలరాం మాట్లాడుతూ భీమవరం పట్టణానికి సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. భీమవరం స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిందని గుర్తు చేశారు. మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పుట్టిన గడ్డ ఈ పరిసర ప్రాంతమేనన్నారు. ఈ సభకు కేరళ రాష్ట్ర న్యాయ, పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్, సిఐటియు ఆలిండియా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కె.హేమలత, తపన్‌సేన్, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్.నరసింగరావు, ఎంఎ.గపూర్, ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ పాల్గొంటారని వివరించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, పట్టణ పౌరసమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు, మెడికల్ అండ్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు ఎస్.శిరీష్‌కుమార్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ వలీ, బి.చైతన్యప్రసాద్, డివైఎఫ్‌ఐ జిల్లా నాయకులు చింతపల్లి మావో, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రాపాక రాజీవ్, వివిధ ప్రజా సంఘాల జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, పళ్లెం కిషోర్, కౌరు పెద్దిరాజు, కేతా గోపాలన్, ఎం.ఆంజనేయులు, అల్లూరి అరుణ్ పాల్గొన్నారు.

9 నుండి డివైఎఫ్‌ఐ యువజనోత్సవాలు

ఆకివీడు: ప్రతియేటా డివైఎఫ్‌ఐ నిర్వహించే సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా ఈ నెల 9 నుండి 17వ తేదీ వరకు క్రీడాపోటీలు నిర్వహిస్తామని యువజనోత్సవాల నిర్వహణా కమిటీ కన్వీనర్ డోకల రవితేజ తెలిపారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మత్తు పదార్థాలు..మాదకద్రవ్యాలను అరికట్టాలి-యువత భవిష్యత్తును కాపాడాలి' అనే నినాదంతో ఈ యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 'గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి.. జూదాలను అరికట్టాలి' అనే లక్ష్యంతో ముందడుగు వేస్తున్నామని తెలిపారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా డాక్టర్ పిబి.ప్రతాప్‌కుమార్, అధ్యక్షునిగా ఎండి.మదనీ వ్యవహరిస్తారని చెప్పారు. డివైఎఫ్‌ఐ మాజీ జిల్లా అధ్యక్షులు డి.రాంబాబు మాట్లాడుతూ 9 నుండి 12వ తేదీ వరకు ఉండి, భీమవరం, కైకలూరు నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు. 14, 15 తేదీల్లో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలస్థాయి పురుషుల వాలీబాల్ పోటీలు, 14న కరాటే విన్యాసాలు, 15న జిల్లాస్థాయి చెస్ పోటీలు, 15వ తేదీ సాయంత్రం జిల్లాస్థాయి పాటల పోటీలు జరుగుతాయన్నారు. 15, 16, 17 తేదీల్లో రాష్ట్రస్థాయి ఓపెన్ చెడుగుడు పోటీలు జరుగుతాయని చెప్పారు. 16, 17 తేదీల్లో రాష్ట్రస్థాయి లీగ్ మహిళా వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. సమావేశంలో నేతలు జి.రామకృష్ణ, ఎస్.కార్తీక్, కె.భగవాన్, పి.బాలు, ఎం.చంద్రతేజ పాల్గొన్నారు.

కొత్త సంవత్సరం.. కొంగొత్త ఆశలు



'కాలగమనంలో మరో ఏడాది గడిచిపోయింది.. విష్ యూ హ్యాపీ న్యూఇయర్' అంటూ కుర్రకారు సందడి నడుమ కొత్త ఆలోచనలు.. కొంగొత్త ఆశలతో నూతన సంవత్సరం 2023 మన ముందు ఆవిష్కృతమైంది. గోడపై పాత క్యాలెండర్ పోయి కొత్త క్యాలెండర్ వచ్చినట్లే మన మదిలో నిరంతరం మెదిలే ఆకాంక్షలు సరికొత్త ఆశలుగా.. వాటి సాధనకు, ఆలోచనలకు పదును పెడుతూ ప్రణాళికలు రచించడం అన్ని తరగతుల ప్రజల్లో సర్వసాధారణంగా జరిగేది. గడిచిన కాలం ఒక గుణపాఠం.. భవిష్యత్తుకు ఒక పునాదిలా పాత, కొత్త మేళవించిన ఆలోచనలతో కొంగొత్త ప్రణాళికలు రచించి అడుగులు ముందుకేసే సమయం ఆసన్నమైంది.

కాలచక్రంలో గడిచిన మరో ఏడాది

నూతన సంవత్సరానికి ఘన స్వాగతం

గతేడాది అందరిలోనూ అసంతృప్తే

ఈ ఏడాదైనా ప్రజల కష్టాలు తీరేనా..!

నూతన సంవత్సరంలో తొలిరోజే ఎలా గడుస్తుందోనని పండుటాకులు, వికలాంగులు, వితంతువుల్లో ఆందోళన నెలకొంది. ప్రధానంగా పింఛన్ల పున:పరిశీలన పేరుతో రెండు జిల్లాల్లో వేలాది మందికి నోటీసులిచ్చిన నేపథ్యంలో తమకు పింఛన్ సొమ్ము అందుతుందా.. లేదా అనే ఆవేదనతో ఆ జాబితాలోని లబ్ధిదారులు కొట్టుమిట్టాడుతున్నారు. సాంకేతిక అంశాలు పక్కన పెట్టి అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు ఇవ్వాలని పండుటాకులు వేడుకుంటున్నారు. వారి ఆకాంక్ష నెరవేరుతుందో.. లేక ప్రభుత్వం నీళ్లు చల్లుతుందో మరికొద్దిసేపట్లో తెలియనుంది.

ఇక పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసరాల ధరలు ఈ సంవత్సరంలోనైనా ఆకాశం నుంచి కిందికి దిగిరావాలని అన్ని తరగతుల ప్రజలు కోరుకుంటున్నారు. ఇక జిల్లాలో వరి, ఆక్వా రైతులు 2022లో పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. గతంలో ధర కోసం పోట్లాడిన రైతన్న మేం పండించిన ధాన్యం కొనండి, అమ్మిన ధాన్యానికి డబ్బులివ్వండి అని మొరపెట్టుకునే దీన స్థితికి పాలకుల విధానాలు తీసుకొచ్చాయి. నూతన సంవత్సరంలో ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులు తొలగడంతోపాటు సొమ్ము అందేలా ప్రభుత్వ విధానాలు ఉండాలని రైతులు కోరుతున్నారు. ఇక డాలర్ పంట ఆక్వా రైతులు రొయ్య ధర గణనీయంగా పడిపోవడంతో తల్లడిల్లుతున్నారు. సాగు చేద్దామంటే మొక్కలు అందక పామాయిల్ రైతులు అధిక ధరకు బ్లాక్ మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొబ్బరి, కూరగాయలు, అరటి, మొక్కజొన్న, మామిడి, పొగాకు తదితర పంటల రైతులు అటు ప్రకృతి వైపరీత్యాలు, ఇటు ప్రభుత్వాల విధానాలతో తల్లడిల్లుతున్నారు. ఈ కొత్త సంవత్సరంలో తమ కష్టాలు గట్టెక్కాలని వారు పుడమి తల్లిని కోరుతున్నారు.



ఇక పరిశ్రమల్లో 2022లో చోటుచేసుకున్న ప్రమాదాలు శ్రమ జీవుల ప్రాణాలను పొట్టనబెట్టుకున్నాయి. ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం ప్రాంతంలోని ఫుడ్‌ఫ్యాట్స్, కడియద్దలో బాణసంచా తయారీ పరిశ్రమ వద్ద చోటుచేసుకున్న పేలుళ్లలో పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. లింగపాలెం మండలం భోగోలులో తోటలో నిద్రిస్తున్న వలస కార్మికులు పిడుగుపాటుకు విగతజీవులయ్యారు. ఇలా వివిధ ప్రమాదాల్లో గతేడాది పెద్దసంఖ్యలో శ్రమజీవులు ప్రాణాలు కోల్పోయారు. పొట్టకూటి కోసం రెక్కల కష్టం చేసే కార్మికుల ప్రాణాలకు ఈ ఏడాదిలోనైనా భరోసా దక్కాలని, పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు, అధికారులు పని చేయాలని అంతా కోరుతున్నారు.

ఇక 2022 ఉద్యోగుల పోరాట పటిమను చాటిన సంవత్సరంగా చెప్పుకోవచ్చు. అదేస్థాయిలో ప్రభుత్వ నిర్బంధమూ ఉద్యోగులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా పిఆర్‌సి, సిపిఎస్ రద్దు విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువులు గళమెత్తిన తీరు ప్రభుత్వ పెద్దలకు గగుర్పాటు కల్గించింది. జిల్లాలో బడుల వద్దకు సైతం పోలీసులు వెళ్లి నోటీసులు అందజేయడం, బడుల వద్ద నుంచి ఇంటికెళ్లే వరకూ వెంబడించడం సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. మరి నూతన సంవత్సరంలో పాలకుల తీరు మారుతుందా లేక కక్షసాధింపు ధోరణి కొనసాగుతుందా అనేది వేచిచూడాలి.

ఇక జిల్లాలో పోలవరం నిర్వాసితులు తమకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం, ప్యాకేజీ అందించాలని, ఏజెన్సీలో అన్యాక్రాంతమైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తమకు హక్కు కల్పించాలని గిరిజనులు, ఎర్రకాల్వ మిగులు భూములు పంచాలని ఆ ప్రాంత పేదలు, నరసాపురం తీరంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తి చేయాలని, తుందుర్రు ప్రాంతంలోని ఆక్వా ఫుడ్‌పార్క్‌ను తీరంలో ఎవరికీ ఇబ్బంది లేని ప్రాంతానికి తరలించి ఆ ప్రాంతంలో ఆక్వా యూనివర్సిటీ నిర్మించాలని, దగ్గులూరులో మెడికల్ కళాశాల పనులు ప్రారంభించాలని, హామీ మేరకు వాటర్‌గ్రిడ్, నరసాపురం, కోడేరు ప్రాంతాల్లో వశిష్ట గోదావరిపై వంతెనల నిర్మాణం, జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇళ్లు అన్నింటినీ వెంటనే లబ్ధిదారులకు అందజేయాలనే డిమాండ్స్ చాలా ఉన్నాయి. మరి వీటన్నింటిపై పాలకులు, అధికారులు కొత్త సంవత్సరంలో ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

2024లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలో నేతలకు ఎన్నికల జ్వరం పట్టుకుంది. ఈ నేపథ్యంలో తమ ఆకాంక్షల్లో కొన్నింటినైనా ఈ ప్రభుత్వం నెరవేరుస్తుందనే ఆశలో జిల్లావాసులు ఉన్నారు. వారి ఆశలు.. ఆకాంక్షలు నెరవేరాలని, దానికోసం అవసరమైతే 'పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు' తప్ప అన్న మహాకవి పలుకులకు అనుగుణంగా పోరుబాట పట్టడమే కర్తవ్యంగా ముందుకు సాగాలని కోరుకుంటూ.. మరోసారి అందరికీ 'నూతన సంవత్సర శుభాకాంక్షలు.

-వియస్‌ఎస్‌వి.ప్రసాద్

ప్రజాశక్తి
www.prajasakti.com

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పని చేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మొగల్తూరులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కన్వీనర్లు, వాలంటీర్లు, సిబ్బందికి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకటి నుంచి తొమ్మిది వరకు లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పింఛన్లను వాలంటీర్లు పార్టీ నేతలను సమన్వయం చేసుకొని పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని, ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్ పర్సన్ మోతుపల్లి రాంభాస్కరరావు, నాయకులు పడవల సత్యనారాయణ, బోనం నరసింహారావు, కొల్లాటి వెంకటేశ్వరరావు, బాలం నాగమల్లేశ్వరరావు, పెంకె చంటి, నాగశంకర్ పాల్గొన్నారు.



కోపల్లెలో క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న రాజు

కోపల్లెలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కోపల్లె గ్రామంలో ఎనిమిదేళ్లుగా క్రిస్మస్ వేడుకలు గ్రాండ్‌గా నిర్వహించడం అభినందనీయమని పాస్టర్ గోడి దైవప్రసాద్ అన్నారు. కోపల్లె గ్రామంలో ఎయిమ్ పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి డి.నిరీక్షణరాజు ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లను సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. డి.నిరీక్షణరాజు మాట్లాడుతూ ఎనిమిదేళ్ల నుంచి గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. పాస్టర్ గోడి దైవప్రసాద్, డి.లాజరస్, ఎంవి.ప్రసాద్, జోషిమురళి, జాన్ రత్నం పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక మార్కెట్ యార్డులో నియోజవర్గ స్థాయి వాలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, రథ సారధులకు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక సచివాలయానికి సంబంధించి ముగ్గురు కన్వీనర్లను, క్లస్టర్ పరిధిలో ఇద్దరు రథసారధులను నియమించినట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న పార్టీ నాయకులను, కార్యకర్తలను కలుపుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి పూర్తిస్థాయిలో తీసుకెళ్లాలని కోరారు. వాలంటీర్లు తమకు కేటాయించిన కుటుంబాల పట్ల ఎంతో ఓర్పుతో, నేర్పుతో ఉండాలని సూచించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు, ఎపి ఆర్‌డిసి ఛైర్మన్ కనుమూరు సుబ్బరాజు (రాజబాబు) మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌కు పార్టీ నేతలు, ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, గూడూరి ఓంకార్, మేడిది జాన్సన్, గూడూరి ఉమాబాల, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగిరాజు, జాతీయ బిసి సంఘాల జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్ పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు విరాళం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో ఉన్న మావుళ్లమ్మకు జి.శ్రీనివాసరావు కామేశ్వరి దంపతులు పది గ్రాముల బంగారం విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హ్యాండ్ వాష్ మిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా, యూనిసెఫ్ సంస్థవారు సమకూర్చిన హ్యాండ్ వాష్ మిషన్‌ను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. పరిశుభ్రత పాటిస్తే కరోనా వంటి భయంకరమైన వైరస్‌లను మనం జయించగలం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, పట్టణ సమాఖ్య సభ్యులు, ఆర్‌పిలు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రికి స్టూల్స్ బహూకరిస్తున్న వెంకన్న

పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి స్టూల్స్ బహూకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం కూర్చోవడానికి ఐదు స్టూల్స్‌ను చిన్నగోపురం ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ గాది వెంకన్న శనివారం బహుకరించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వసతులు కల్పిస్తున్న గాదె వెంకన్నను వైద్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి అడ్వైజరి కమిటీ మెంబర్ చెన్ను విజయ్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ గంటా ప్రభాకర్, డాక్టర్ గీతాకుమారి, డాక్టర్ నళిని, డాక్టర్ జయదుర్గ, ,డాక్టర్ గంగాభవాని, డాక్టర్ మౌనిక,హెడ్ నర్స్ సుజాత పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఆచంట


ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించడమే తమ లక్ష్యమని ఆచంట సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరావు అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి అధ్యక్షతన శనివారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఏరియాలో వివిధ ప్రదేశాల్లో సీసీ డ్రెయిన్లు, గ్రావెల్ రోడ్లు పలు అభివృద్ధి పనులు చేసేందుకు పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపినట్లు ఆమె వివరించారు. పారిశుధ్య కార్మికులకు రెండు జతల దుస్తులు, సబ్బులు, కొబ్బరినూనె తదితర సామగ్రి పంపిణీ చేశారు. ఆచంట గ్రామ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ అడ్డాల పెద్దిరాజు, పంచాయతీ కార్యదర్శి జివిఎన్ఎల్.నరసింహరావు పాల్గొన్నారు.

'కందుకూరు ఘటనకు చంద్రబాబుదే బాధ్యత'

ప్రజాశక్తి - పాలకొల్లు

కందుకూరులో ఎనిమిది మృతికి బాధ్యుడిగా చంద్రబాబుపై కేసు పెట్టాలని డిసిసిబి ఛైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. ఆయన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ చేస్తున్న సంక్షేమ పథకాలను ఎలా విమర్శించాలో తెలియక చంద్రబాబు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారన్నారు. ఈ సమావేశంలో వైసిపి నేతలు చెన్ను విజయ్, పిల్ల శ్రీను, రేలంగి శ్రీనివాసరావు, పెచ్చెట్టి కృష్ణాజి పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు



తణుకులో బెలూన్లు ఎగురవేస్తున్న పివి.ప్రతాప్

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఈ నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహించే సిఐటియు రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపునిచ్చారు. స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిఐటియు రాష్ట్ర మహాసభ సందర్భంగా ఎరుపు రంగు బెలూన్స్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, అజయకుమారి, దక్షిణామూర్తి మాట్లాడుతూ సిఐటియు రాష్ట్ర మహాసభలో కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి సమరశీల పోరాటాలు రూపొందిస్తామని తెలిపారు. జనవరి 2వ తేదీన జరిగే భారీ బహిరంగ సభకు ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్.ఆదినారాయణబాబు, కార్యదర్శి గుబ్బల గోపి, కామన మునిస్వామి, గార రంగారావు, టి.రామకృష్ణ, ఎన్.చిన్నారావు, ఎం.గోవిందరాజు, సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజెటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వెంప గ్రామం బస్టాండ్ సెంటర్‌లో శనివారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భీమవరం పట్టణంలో మొట్టమొదటిసారిగా సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, కార్మికుల ప్రయోజనాలతో పాటు దేశ ప్రజల ప్రయోజనం కోసం సిఐటియు పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దోసెనుపూడి నాగులు, సింధూరి, శ్రీను, కొత్తపల్లి కృష్ణ, మల్లికార్జునరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వితరణ

ఆకివీడు : ఈ నెల రెండో తేదీ నుంచి నిర్వహించే సిఐటియు రాష్ట్ర మహాసభకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు తమ వంతు వితరణ చేశారు. స్థానిక సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు అప్పారావు, కె.కవిటినాయుడులకు పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు రూ.పది వేలు అందించారు. సిపిఎస్ ఉద్యమానికి సిఐటియు ఎంతగానో మద్దతు ఇచ్చిందని వారు తమ సంతోషం వ్యక్తం చేస్తూ వితరణ అందించారు. ఈ సందర్భంగా రవికుమార్‌మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికులకు ఏ విధమైన సమస్యలు వచ్చినా వారికి మద్దతుగా పోరాటంలో సిఐటియు ముందు వరుసలో ఉంటుందన్నారు. వితరణ అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్, టి.వెంకటేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు, పి.విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, సిఐటియు నాయకులు షేక్ వలి పాల్గొన్నారు.



ఆకివీడులో ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

నరసాపురం :ఐద్వా జాతీయ మహాసభ జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ పిలుపునిచ్చారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో 2023 క్యాలెండర్‌ను నరసాపురం గ్రంథాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ నెల ఆరో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు తిరువనంతపురంలో నిర్వహిస్తున్న ఐద్వా 5వ జాతీయ మహాసభ జయప్రదం చేయాలని జెండాను ఎగురవేశారు. జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ మహిళల సమస్యలపై నిరంతరం ఐద్వా సంఘం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కేటా పద్మజ, సిహెచ్.వరలక్ష్మి, కొత్తూరు నాగరత్నం, యశోద, రోజా మణి, సుగుణ, మీనా పాల్గొన్నారు.

చోరీకి గురైన ట్యాబ్‌లు లభ్యం


నాటకీయంగా దొరికిన వైనం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ఎండిడిఒ కార్యాలయంలో అపహరణకు గురైన ట్యాబ్‌లు ఆ కార్యాలయం పక్కనే ఉన్న టిటిడి కళ్యాణ మండపం ఆవరణలో దొరికాయి. కొన్ని నాటకీయ పరిణామల తరువాతే ఈ ట్యాబ్‌లను దొంగలు శనివారం అక్కడ వదిలి వెళ్లినట్లు పోలీసులకు సమాచారం ఇవ్వడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఎంపిడిఒ కార్యాలయంలోనే మండల విద్యాశాఖ కార్యాయలం నిర్వహిస్తున్నారు. ట్యాబ్‌లు ఉంచిన తలుపులు తాళాలు వేసి ఉన్నా ట్యాబ్‌లు పోవడంతో కార్యాలయం సిబ్బందిపైనా సంబంధిత అధికారులు పలు అనుమనాలు వ్యక్తపరచడంతో కింది స్థాయి సిబ్బంది మనస్తాపానికి గురయ్యారు. దొంగలు ఎవరో పోలీసులు గుర్తించి తమ నిజాయతీని గుర్తించాలని వారు కోరుతున్నారు. ఈ నెల 25వ తేదీనే ట్యాబ్‌లు పోయినట్లు సిబ్బంది గుర్తించినట్లు సమాచారం. అప్పటి నుంచి ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి ప్రతిరోజు అక్కడి పరిసరాలను పరిశీలిస్తున్నారు. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎంపిడిఒ పరిసర ప్రాంతాన్ని పోలీసులు, విద్యాశాఖ సిబ్బంది కూడా అదే రోజు పలుమార్లు పరిశీలించినా కనిపించని ట్యాబ్‌లు అదే ప్రాంతంలో శనివారం కనిపించిడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్యాబ్ ఐఎంఇఐ నెంబర్‌ను బట్టి అవి ఏపి ప్రాంతాలకు తీసుకెళ్లారో తెలుస్తుందంటున్నారు. దీంతో దొంగలను తేలికగానే గుర్తించవచ్చని విద్యాశాఖాధికారులు అంటున్నారు. ఇదిలా ఉంటే వీరవాసరం పోలీసుల వ్యవహార శైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిందితులు ఎవరో తెలిసినా ప్రజలకు తెలిసేలా బహిర్గతం చేయకపోవడం ఈ స్టేషన్‌కు ఆనవాయితీగా వస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిందితులు తెలిస్తేనే వారి పట్ల అప్రమత్తంగా ఉండే అవకాశం ఉంటుందంటున్నారు. ఈ ట్యాబ్‌ల దొంగతనంతో సంబంధంఉన్నవారు తెలిసినా పోలీసులు వారిని బహిర్గతం చేస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.



ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



ప్రజలతో మాట్లాడుతున్న ప్రసాదరాజు

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - మొగల్తూరు

నియోజకవర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సందర్శించిన సమయంలో ప్రజల నుంచి వచ్చిన వినతలన్నింటిని పరిష్కరిస్తున్నామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని శేరేపాలెం గ్రామంలో గడపగడపకూ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామ అధ్యక్షులు కొత్తపల్లి బాబి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తాగునీటికి రూ.47 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. దీనిలో భాగంగా రూ.25 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో సర్పంచి తణుకుల మునీశ్వర అధ్యక్షతన గ్రామ అభివృద్ధిపై వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వేగి బాబి, గూడూరు మావుళ్ల, తన్నీడి గిరి, తణుకుల సోమేశ్వరరావు, రంగిశెట్టి ఏసు, కట్ట రాంబాబు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉండి

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఎల్లప్పుడు ముందుంటుందని మానవతా సేవా సంస్థ ఉండి మండల అధ్యక్షులు దంగేటి రామలింగేశ్వరరావు అన్నారు. మండలంలోని వెలివర్రు గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బొడ్డు కిషోర్ కుటుంబాన్ని శనివారం పరామర్శించి వారికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ.నాలుగు వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొడ్డు కిషోర్‌కు ఇద్దరు చిన్నారులు ఉన్నారని, వారిని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. మానవత సంస్థ ద్వారా కిషోర్ కుటుంబానికి అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంతెన రమాదేవి, గాదిరాజు సూర్య కుమారి, కొమ్మర రవితేజ, కత్తుల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - ఆచంట

2023 నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ అన్నారు. నూతన సంవత్సర వేడుకలను వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తాను రూపొందించిన శ్రీకారం షార్ట్ ఫిల్మ్‌ను ఈ నూతన సంవత్సరంలో విడుదల చేస్తామని తెలిపారు.

అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆచంట

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అధ్యాపకుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎం.మనోజ్ డిమాండ్ చేశారు. మండలంలోని వల్లూరులో నూతనంగా మంజూరైన ప్రభుత్వం జూనియర్ కళాశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.భవానీశంకర్ మాట్లాడుతూ నూతనంగా మంజూరైన ఈ కళాశాలకు 16 మంది విద్యార్థులు చేరారని, ఒక్క లెక్చరర్ పోస్టు కూడా మంజూరు కాలేదని, దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క ఇంటర్ విద్యార్థులకు పబ్లిక్ ఎగ్జామినేషన్ టైం టేబుల్ జారీ అయినా సరే వీళ్లకు ఉపాధ్యాయులను కేటాయించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇంటర్ కాలేజీల్లో విద్యార్థులకు మౌలిక వసతులు, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినప్పుడే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.దినేష్ జె.ప్రతీక్‌సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మనోజ్

పేదలకు నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పండుగ సమయంలో పేదలకు బియ్యం, పప్పు దినుసులు, వివిధ నిత్యవసర వస్తువులు అందించడం గొప్ప విశేషమని భీమవరం తహాశీల్దార్ వై.రవికుమార్ అన్నారు. వెంకటాచారి అరసవల్లి వెంకటాచారి, వెంకటాయమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పెద్దేటి వారి వీధిలోని పేదలకు శనివారం బియ్యం, తదితర వస్తు సామగ్రి అందించారు. ఈ సందర్భంగా అరసవల్లి ఛారిటబుల్ ట్రస్ట్ వారిని అభినందించారు. ప్రముఖ వైద్యులు బసవ కృష్ణ ప్రసాద్ కల్పన దంపతులు మాట్లాడుతూ తాము కూడా ఇదే స్ఫూర్తితో కొంత ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అరసవల్లి సుబ్రహ్మణ్యం పెద్దేటి వారి వీధిలో 46 మందికి నిత్యావసర సరుకులు అందించారని చెప్పారు.

కొబ్బరి కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - పోడూరు

కొబ్బరి వలుపు, దింపు కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సిఐటియు నాయకులు పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. వేడంగిలో ఆయన శనివారం దింపు, వలుపు కార్మికులతో మాట్లాడుతూ వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఎగుమతి, దిగుమతి కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. జనవరి రెండో తేదీన నిర్వహించే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలకు వలుపు, దింపు, ఎగుమతి, దిగుమతి కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు బొంతు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, చేగొండి రామలింగయ్య, అడ్డాల సుబ్రహ్మణ్యం, దానయ్య పాల్గొన్నారు.




కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గ్రామాల్లో పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలం కొణితివాడ గ్రామంలో చెత్తను సేకరించేందుకు గ్రామపంచాయతీ నిధులు రూ.3.20 లక్షలతో కొనుగోలు చేసిన రెండు వాహనాలను శనివారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచి, వార్డు మెంబర్లు, పంచాయతీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి చెత్త రహిత గ్రామాలను తీర్చిదిద్దేలా కృషి చేయాలని కోరారు. చెత్త సేకరణ వాహనాలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి నాగరాజు శ్రీనివాసరాజు, ఎంపిటిసి సభ్యులు పెంటకోటి సైదేశ్వరరావు, కోటేశ్వరరావు, నాగరాజు గోపాల రాజు, కోటిపల్లి బాబు, కొల్లి ప్రసాద్, చిగురుపాటి సందీప్ పాల్గొన్నారు.

జోగినాయుడుకు సత్కారం



జోగియ్యనాయుడును సత్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థలో ఎడిఆర్‌గా పని చేయడం చాలా ఆనందంగా ఉందని డాక్టర్ జి.జోగినాయుడు అన్నారు. ఇప్పటివరకు మార్టేరులో పని చేసిన ఆయన శ్రీకాకుళం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జోగినాయుడు దంపతులకు సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ తనకు పట్టుదల, అభివృద్ధి, నిజాయతీ చాలా ముఖ్యమన్నారు. తాను ఎక్కడ పని చేసిన తన కింది స్థాయినుంచి తన వరకు ఎటువంటి మాట పట్టింపు లేకుండా పని చేయడమే లక్ష్యమన్నారు. అనంతరం భార్య అన్నపూర్ణ, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం హెడ్ డాక్టర్ పి.మునిరత్నం, విజయరాయి నుంచి డాక్టర్ కె.మోహనరావు, తూర్పుగోదావరి జిల్లా ఏరువాక హెడ్ డాక్టర్ సిహెచ్‌వి .నరసింహరావు, కెవికె ఉండి డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, పశ్చిమగోదావరి జిల్లా ఏరువాక హెడ్ డాక్టర్ పి.ఫణికుమార్, వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్, ప్రధాన శాస్త్రవేత్త, కోశాధికారి డాక్టర్ ఎం.చారులత పాల్గొన్నారు.

శివ స్వచ్ఛంద సంస్థ ద్వారా మరిన్ని సేవలు

ఉండి :శివ స్వచ్ఛంద సేవ సంస్థ అధినేత, ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు శనివారం ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలోని పార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివరామరాజు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో శివ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ప్రజలకు మరింత సేవలను అందించేందుకు వీలుగా పరమశివుని ఆశీర్వాదం తీసుకునేందుకు వచ్చానని చెప్పారు.

సాంబమూర్తికి నివాళి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సరిగుట్లపాడు ఏరియాలో ఆక్రమణకు గురైన వేలాది బంజరు భూములను భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రాంత ప్రజలకు పంచిన ఘనత భూ పోరాటయోధుడు నాగిడి సాంబమూర్తిదేనని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సాంబమూర్తి 20వ వర్ధంతిని భీమవరం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఆ ప్రాంత భూస్వాములు సాంబమూర్తిని హతమార్చాలని ప్రయత్నించినా తను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి భూ పోరాటాన్ని కొనసాగించారన్నారు. భూ పోరాటంలో ఆనాటి శాసనసభ్యులు కీర్తిశేషులు వంక సత్యనారాయణ అసెంబ్లీలో ఎన్నో పోరాటాలు చేశారన్నారు. సాంబమూర్తికి అండగా నెక్కంటి సుబ్బారావు, ఐఎస్.రాజు, యాలబండి పోలిశెట్టి, వీరవల్లి సత్యనారాయణ నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండలం కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్, పట్టణ కార్యదర్శి సిహెచ్.రంగారావు, పార్టీ నాయకులు శాంతమూర్తి పాల్గొన్నారు.

బదిరుల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

శ్రీ వెంకటేశ్వర బదిరుల పాఠశాలలో మూగ, చెముడు విద్యార్థులతో సంక్రాంతి సంబరాలు శనివారం శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రతి పండుగను పాఠశాలలో పోటీలుగా నిర్వహిస్తూ వారిని కూడా సమాజంలో వ్యక్తులుగా నిలబెట్టడం ఎంతో గొప్ప విశేషమని శ్రీవిజ్ఞాన వేదిక సంస్థను అభినందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ముగ్గుల పోటీల్లో 26 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. పోటీల్లో పాల్గొన్నవారందరికీ ప్రముఖ వ్యాపారవేత్త, లయన్స్ క్లబ్ సభ్యులు కట్టా నరసింహస్వామి ఆర్థిక సహకారంతో బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ భీమవరం పట్టణ కార్యదర్శి నరహరిశెట్టి కృష్ణ, అధ్యాపకులు కె.శ్రీదేవి, ఎం.గాయత్రి, కె.విజయ, సి.అరుణ, కె.కీర్తన, వి.హరిప్రియ పాల్గొన్నారు.

మోగల్లులో ఫీవర్ సర్వే

ప్రజాశక్తి -పాలకోడేరు

పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రంగమనాయుడు ఆదేశాల మేరకు మోగల్లు గ్రామంలోని ఆరుంధతిపేట, ఎస్‌సి ప్రాంతాల్లో శనివారం ఫీవర్ సర్వే చేశారు. మహిళా వైద్యురాలు స్వర్ణనిరంజని, సిబ్బంది ఆరుంధతి పేటలో పర్యటించి సర్వేను పరిశీలించి ప్రజలకు అవసరమైన వైద్యసలహాలను అందించారు. ఈ సందర్భంగా మహిళా వైద్య అధికారి స్వర్ణ నిరంజని మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహ్వారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి, కార్యదర్శి మహాలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాళ్ల

జనవరి 2న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా కాళ్లకూరు వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్లు, మూల విరాట దర్శనానికి ఆలయం లోపల క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ఉత్తర ద్వారా దర్శనానికి వచ్చే వృద్ధులకు, చిన్నారులకు పాలు ఉచితంగా అందించనున్నారు. దర్శనానికి వచ్చిన భక్తులకు మంచినీరు, ఉచిత ప్రసాదాలు అందిస్తామని దేవస్థానం ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ఎఒ చాగంటి సురేష్ నాయుడు తెలిపారు.